సాక్షి ప్రకాశం

ఆదివారం । 26 । మార్చి । 2023



వర్షంతో రైతులకు అవస్థలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం కురిసింది. బేస్తవారిపేట, కంభం, మార్కాపురం, కనిగిరిలో ఒకమోస్తరు వాన కురిసింది. - 8లో..



సేవాగుణంతో వైద్యసేవలందించాలి

ఎంజీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులు సేవాగుణంతో వైద్యసేవలందించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32 /27

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సా. 06:27 ని. ఆదివారం

సహర్ : ఉ. 04:49 ని. సోమవారం

మాటే మంత్రం..
మనసే లక్ష్యం

ఆర్థికంగా వెనుకబడినా.. ఉన్నత లక్ష్యాల సాధనలో దూసుకుపోవాలి. ఉత్తమైన ఆలోచనలతో నిర్దేశించుకున్న శిఖరాలను చేరుకోవాలి. 'పల్లె నిద్ర' కార్యక్రమంలో జిల్లా ప్రథమ పౌరుడు మదిలో మెదలిన మహోన్నత ఆలోచన. 'కాఫీ విత్ కలెక్టర్' ఎందరో పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దిక్సూచీగా మారనుంది. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులను ప్రతి శనివారం ఇంటికి పిలిపించి వారితో మమేకమవుతూ వారి లక్ష్యాలను, భవిష్యత్ ఆలోచనలను నేరుగా తెలుసుకుంటున్నారు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్. కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలను సైతం తెలుసుకుని వారి బంగారు భవిష్యత్‌కు ఉన్నత బాటలు వేసేలా స్ఫూర్తిని నింపుతున్నారు.



కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ బాటగా 'కాఫీ విత్ కలెక్టర్'
- జిల్లాలో కలెక్టర్ దినేష్‌కుమార్ వినూత్న ప్రయోగం
- విద్యార్థుల లక్ష్యాలను తెలుసుకుని కెరియర్ గైడెన్స్
- కార్యక్రమాన్ని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ బృందం
- 'మార్గదర్శిని' పేరుతో కేంద్రంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: స్థానికంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారులు నేరుగా తెలుసుకునేందుకు కలెక్టర్ 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన సైతం ఈ కార్యక్రమంలో పాల్గొంటూ వచ్చారు. గతేడాది గిద్దలూరు నియోజక వర్గం కంభం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అదే గ్రామంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మాటామంతి సాగించారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను తెలుసుకున్నారు. ఆ సందర్భంగా వారు చెప్పిన సమాధానాలను విని ఆశ్చర్యపోయారు. భవిష్యత్‌లో తాము కానిస్టేబుల్, వీఆర్‌ఓ, చిన్న ప్రభుత్వ ఉద్యోగం వంటి చిన్నచిన్న కొలువు చేయాలని ఉందని చెప్పడంతో నివ్వెరపోయారు. ఈ సందర్భంలోనే విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించారు. అందులో భాగంగానే ప్రతి శనివారం 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్టీ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో మమేకమవుతున్నారు.

నిర్దిష్టమైన లక్ష్యాలు...

'కాఫీ విత్ కలెక్టర్'కు హాజరైన విద్యార్థుల్లో మార్పు తెచ్చేందుకు ప్రణాళికబద్ధంగా సాగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కెరియర్ గైడెన్స్ పేరుతో ప్రత్యేకంగా మెంటార్స్‌ను పిలిపించి వారితో విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇప్పించడంతో పాటు అవసరమైన పుస్తకాలు అందజేస్తున్నారు. కెరియర్ గైడెన్స్‌లో 39 రకాల అంశాలతో వివిధ నైపుణ్యాలు కలిగేలా ఇప్పటికి దాదాపుగా 29 సెషన్స్ విద్యార్థులకు ఇచ్చారు. మొదటిలో చిన్న చిన్న లక్ష్యాలను చెప్పిన విద్యార్థులు ఇప్పుడు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేయడం ప్రారంభించారు. కలెక్టర్ చేపట్టిన కార్యక్రమం విద్యార్థుల్లో ఎంత స్ఫూర్తిని రగిలించిందో అవగతమవుతోంది. విద్యార్థులు స్వయంగా ఆసక్తి ఉన్న రంగం, ఉద్యోగాలపై లక్ష్యం నిర్దేశించుకుని అందుకు సంబంధించిన పూర్తి పరిజ్ఞానం, అవగాహనతో పాఠశాల చదువుల నుంచే సరైన అడుగులు వేసేలా కెరియర్ గైడెన్స్ ఉపకరిస్తోంది.

రియల్ లైఫ్ మోడల్స్‌ను విద్యార్థులతో అనుసంధానం:

'కాఫీ విత్ కలెక్టర్'లో ప్రతి విద్యార్థితో నేరుగా కలెక్టర్ మాట్లాడుతూ వారి లక్ష్యాలను తెలుసుకుంటున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, లాయర్, ఇంజినీర్, సాఫ్ట్‌వేర్, పోలీసు అధికారి ఇలా వారి ఆసక్తిని తెలుసుకుని అవసరమైన సూచనలు ఇస్తున్నారు. అంతేకాదు 'రియల్ లైఫ్ రోల్ మోడల్స్'ని విద్యార్థులతో మాట్లాడిస్తూ స్ఫూర్తిని నింపుతున్నారు. డాక్టర్ అవ్వాలని చెప్పిన విద్యార్థులకు డాక్టర్లతో, పోలీసు అధికారి కావాలనే లక్ష్యాలను చెప్పిన విద్యార్థులకు పోలీసు అధికారులతో సలహాలు సూచనలు ఇప్పిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి పిలుపు...

వినూత్న కార్యక్రమాల అమలు కేటగిరీలో కేంద్ర ప్రభుత్వం అవార్డులకు సంబంధించి 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమాన్ని వివరించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు పిలుపు వచ్చింది. ఈ మేరకు కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ఢిల్లీ వెళ్లారు. 'కాఫీ విత్ కలెక్టర్' పేరుతో చేపట్టిన కెరియర్ గైడెన్స్ క్లాసులకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో భాగంగా 'మార్గదర్శిని'కి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



ప్రభుత్వ వసతి గృహం విద్యార్థినీ, విద్యార్థులతో తన ఆలోచనలు పంచుకుంటున్న కలెక్టర్



మార్గదర్శిని కార్యక్రమంలో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని

కేంద్ర బృందం జిల్లాలో పర్యటన



మార్గదర్శిని కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి కేంద్రం బృందం జిల్లాకు వచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 17న కేంద్ర ప్రభుత్వ వ్యయ విభాగం డైరెక్టర్ ఆర్‌కే.తాలూక్ దార్, ఆహార, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ సెక్రటరీ సీతారామ్ మీనాతో కూడిన బృందం జిల్లాలో పర్యటించింది. ప్రభుత్వ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించారు. కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులతో, కెరియర్ గైడెన్స్ మెంటార్లతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు.

లక్ష్యం సాధించడంలో స్పష్టత ఉండాలి



విద్యార్థులు వారికి ఆసక్తికి తగినట్లు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంతో పాటు దాన్ని సాధించడంలో స్పష్టమైన అవగాహన ఉండాలి. ఆ దిశగా విద్యార్థులకు అవగాహన కల్పించడమే 'కాఫీ విత్ కలెక్టర్' 'కెరియర్ గైడెన్స్' ముఖ్య ఉద్దేశం. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల నేపథ్యం ఎక్కువ పేదరికంలో ఉండటం కూడా గమనించాను. పేదరికం ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు అడ్డుకాదని విద్యార్థులకు స్ఫూర్తిని ఇవ్వడం మరో ప్రధాన అంశం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

అగ్రికల్చర్ ఇంజినీర్‌నవుతా..



కలెక్టర్ నిర్వహిస్తున్న కెరియర్ గైడెన్స్ ఎంతగానో ఉపయోగపడుతోంది. నేను బాగా చదువుకుని అగ్రికల్చర్ ఇంజినీర్‌ను అవుతాను. వ్యవసాయంలో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తాను. అన్నం పెట్టే రైతు కోసం అగ్రికల్చర్ ఇంజినీర్‌ను అయ్యి వారికి అండగా ఉంటాను.

– ఐ.అనూష, 9వ తరగతి, చిలంకూరు గ్రామం, మర్రిపూడి మండలం

కలెక్టర్‌కు రుణపడి ఉంటా



కలెక్టర్ విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న వినూత్న కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులంతా కలెక్టర్‌కు రుణపడి ఉంటాం. జెట్ పైలెట్ అయి దేశరక్షణలో ఉండాలనేది నా లక్ష్యం. ఆ దిశగా కృషి చేస్తా. కలెక్టర్ విద్యార్థులతో విద్యార్థిలా ఉంటూ మాట్లాడటం ఎంతో స్ఫూర్తినిచ్చింది.

– పి.వీరేంద్ర, విద్యార్థి, గుమ్మనంపాడు, సంతనూతలపాడు మండలం

సత్ఫలితాలిస్తున్న కెరియర్ గైడెన్స్



కలెక్టర్ నిర్వహిస్తున్న కాఫీ విత్ కలెక్టర్, కెరియర్ గైడెన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సత్ఫలితాలు ఇస్తున్నాయి. కార్యక్రమానికి ముందు, కార్యక్రమానికి తర్వాత అన్నట్లు విద్యార్థుల ఆలోచన విధానం ఉంది. కెరియర్ గైడెన్స్‌తో మెంటర్స్‌ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవడం, ఆ దిశగా సాధన చేయడం వంటివి ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

– ఎస్ లక్ష్మానాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్, ఎస్పీ



హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఒంగోలుకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు, హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.కృష్ణ మోహన్‌లను ఎస్పీ మలికా గర్గ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్ఎస్పీ గెస్ట్‌హౌస్‌లో న్యాయమూర్తులను కలిసిన ఎస్పీ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. హైకోర్టు జడ్జిలను కలిసిన వారిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయికి పుల్లలచెరువు విద్యార్థి సైన్స్ ప్రాజెక్టు

ఒంగోలు/పుల్లలచెరువు: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు నిఖిల్‌చంద్ ఎంపికయ్యాడు. పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిఖిల్ చంద్ ప్రదర్శించిన ఫ్యాబ్రికేషన్ ఆఫ్ యాక్సా మిషన్ అనే ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23, 24 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఆన్‌లైన్‌లో జరిగాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 15 ప్రాజెక్టులు పోటీల్లో పాల్గొన్నాయి. ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నిఖిల్‌చంద్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా ఎంపికైన నిఖిల్‌చంద్‌ను, గైడు ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయుడ్ని డీఈవో పి.రమేష్, మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌలేశ్వర్, సైన్స్ అధికారి టి.రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్లో శనివారం ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థిని, గైడ్ ఉపాధ్యాయుడు మస్తాన్‌వలిని పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు అభినందించారు.

ప్రాజెక్టు ప్రత్యేకతలు..వినియోగించిన పరికరాలు:

ఈ పరికరం తయారీకి తక్కువ బరువు కలిగిన ఐరన్ ఫ్రేమ్, నాలుగు హెక్సా బ్లేడ్లు, నాలుగు వైస్‌లు, 12 ఓల్టుల పవర్‌తో పనిచేసే మోటారు, స్క్రూలు, బోల్టులు వినియోగించారు. ఈ మిషన్‌కు నాలుగు వైపులా నాలుగు హెక్సాబ్లేడ్లను బిగించారు. నాలుగు వైస్‌లను అమర్చారు. వాటి సాయంతో పైపులను, చెక్కలను, మనకు కావాల్సిన కొలతలతో మోటారును ఆన్‌చేయగానే హెక్సాబ్లేడ్లు కట్ చేస్తున్నాయి. దీని సాయంతో ఒకే సారి నాలుగు పైపులను కట్ చేయవచ్చు. సమయం ఆదా అవడం, శ్రామికుల సంఖ్య తగ్గుతుంది. తక్కువ సమయంలో పని పూర్తిచేయగలుగుతారు. తక్కువ శబ్దంతో పనిచేయడం, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి సులువుగా మార్చేందుకు అవకాశం ఉంటుంది. దీనిని విడివిడి భాగాలు చేసి స్క్రూలు, బోల్టుల సాయంతో మళ్లీ బిగించుకునే సౌలభ్య ఉంది. తన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికకావడం ఆనందంగా ఉందని విద్యార్థి నిఖిల్ చంద్ పేర్కొన్నారు.



జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపికైన ప్రాజెక్టు

మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ ఆసరా మూడో విడత వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, నగర మేయర్



మహిళలకు చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్

ఒంగోలు అర్బన్: మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మహిళ ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. శనివారం వైఎస్ఆర్ ఆసరా పథకం మూడో విడత అర్హులకు బ్యాంకు ఖాతాలో నేరుగా నిధులు జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా దెందులూరులో ప్రారంభించారు. దీనికి అనుబంధంగా జిల్లా స్థాయిలో ప్రకాశం భవనంలో వీడియో సమావేశం ద్వారా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసరా మూడో విడత లో జిల్లాలోని 36,729 స్వయం సహాయక సంఘాల్లో 3,59,506 మంది సభ్యులకు రూ.280.50 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసరా పథకంలో జిల్లాలో మొదటి విడతలో 35,701 స్వయం సహాయక సంఘాల్లోని 3,51,376 మంది సభ్యులకు రూ.267.54 కోట్లు, రెండో విడతలో 36,721 సంఘాల్లోని 3,59,027 మంది సభ్యులకు రూ.291.68 కోట్లు ప్రభుత్వం అందించిందని చెప్పారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాల్లో ముందడుగు వేసేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అధికంగా మహిళలకు అందేలా చూస్తూ మహిళా పక్షపాతిగా ఉన్నారని కొనియాడారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ రవికుమార్, ఎల్‌డీఎం యుగంధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేలా బడుగు వికాసం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ యువతకు 45 శాతం సబ్సిడీతో అందించిన మూడు కార్లు, రెండు మినీ ట్రక్కులను లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పొదిలి రూరల్: వైఎస్సార్ ఆసరా 3 వ విడత నగదును వారి ఖాతాల్లో జమ చేసినందుకు శనివారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు, ఆముదాలపల్లి, ఏలూరు, తలమళ్ల, కుంచేపల్లి, పాములపాడు, కొండాయపాలెం, కంభాలపాడు, మల్లవరం, సూదనగుంట, పొదిలి ఆర్బీకేల్లో డ్వాక్రా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



మర్రిపూడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం..



పొదిలిలో క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

మర్రిపూడిలో..

మర్రిపూడి: మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ సుదీపా, ఈవోఆర్డీ నాగూర్‌వలి, సర్పంచ్ కే భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



వైఎస్సార్ సీపీ ప్రభపై నుంచి మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాగా పనిచేస్తుందని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఐటీ వరంలో శుక్రవారం రాత్రి సంతాన వేణుగోపాల స్వామి తిరునాళ్ల, చాపలమడుగులోని పోలేరమ్మ తల్లి తిరునాళ్లలో మంత్రి సురేష్ పాల్గొని దేవతా మూర్తులను దర్శనం చేసుకున్నారు. అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై నుంచి మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాని కంటిలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అన్నారు. నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రం పలు రంగాల్లో అభివృద్ధిపథంలో ఉందని, గతంలో ఎన్నుడూ లేని అభివృద్ధిని నేడు రాష్ట్రంలో చూస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నవరత్నాల ద్వారా దాదాపు 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. చట్టాలను మాయచేసే చంద్రబాబు ఏదో ఒక్క ఎమ్మెల్సీ స్థానం గెలవగానే సంబరాలు చేసుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ లో తప్పు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఉన్న వెలుగొండ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తారని అన్నారు. టీ5 కాలువ పనులకు కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తారని చెప్పారు. దాంతో పాటు విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు రంగన్నపాలెం వద్ద 223 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణపనులకు కూడా శంకుస్థాపన చేస్తామన్నారు. అనంతరం కార్యకర్తలు, నాయకులు మంత్రి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, వైపాలెం మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, గడ్డంసుబ్బయ్య, మల్లెల వెంకటరెడ్డి, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోళ్ల లారీ బోల్తా



రోడ్డుపై పడిన కోళ్లఫారం లారీ

గిద్దలూరు రూరల్: కోళ్ల లారీ బోల్తా పడి వందల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని చికెన్ దుకాణాలకు సప్‌లై చేస్తూ వెళుతున్న కోళ్ల ఫారమ్ లారీ మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో కొంత సమయం ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అనంతరం కోళ్లఫారమ్ నిర్వాహకులు క్రెయిన్ సహాయంతో లారీని రోడ్డు నుంచి పక్కకు తొలగించారు. లారీ కిందపడి రోడ్డు పక్కనే నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. వందల కోళ్లు మృత్యువాతపడ్డాయి.

ఇష్టంతో చదవండి

- కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఒంగోలులోని నాలుగు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు చెందిన 20 మంది 9వ తరగతి విద్యార్థులతో శనివారం 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమం నిర్వహించి ఇష్టాగోష్ఠి నిర్వహించారు. విద్యార్థుల అభిరుచి తెలుసుకోవడంతో పాటు వారి కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకుని పలు సూచనలు చేశారు. కలెక్టర్‌గా ఎదిగిన తన గురించి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. అనంతరం ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలను సంతకాలు చేసి అందచేశారు. కార్యక్రమంలో సంక్షేమ సాధికారత అధికారి లక్ష్మానాయక్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి లింగయ్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు అంకబాబు, కె.శ్రీలత, దుర్గాలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ అధికారులతో సమీక్ష



హైకోర్టు జడ్జి బొప్పూడి కృష్ణమోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా జడ్జి ఏ భారతి

ఒంగోలు: హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి బొప్పూడి కృష్ణమోహన్ శనివారం ఒంగోలుకు చేరుకున్నారు. స్థానిక ఎన్ఎస్‌పీ అతిథి గృహం వద్ద ఆయన్ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా పోర్టుఫోలియో జడ్జి బొప్పూడి కృష్ణమోహన్.. జ్యుడీషియల్ అధికారులతో జిల్లాలోని కేసులకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒంగోలుకు వచ్చి అతిథిగృహంలో ఉన్న హైకోర్టు జడ్జి కె.మన్మథరావుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించారు.

కెమెరాల కోసం లారీ లాక్కున్నారు!

- అడవిలో కెమెరాలు చోరీ అయ్యాయని వెదురుబొంగుల లారీ స్వాధీనం
- అధికారుల తీరుపై కాంట్రాక్టర్ల అసహనం



అటవీశాఖ నిర్బంధించిన లారీ

గిద్దలూరు రూరల్: అడవిలో అటవీ శాఖకు చెందిన కెమెరాలు చోరీకి గురయ్యాయని ఆ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వాటిలో ఎటువంటి సంబంధం లేని ఓ బొంగుల లారీని అడ్డుకొని.. మా కెమెరాలు తీసుకువచ్చి లారీని తీసుకువెళ్లండని లారీని స్వాధీనం చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. అటవీశాఖ పరిధిలో వెదురు బొంగుల కాంట్రాక్టర్ తిరుమలయ్యకు చెందిన లారీ అటవీ ప్రాంతంలోని వెదురు బొంగుల లోడును తీసుకువస్తుండగా కొత్తకోట బీటు పరిధిలోని గరిసెమూల ప్రాంతంలోకి రాగానే అటవీశాఖ అధికారులు లారీని అడ్డుకుని అటవీ ప్రాంతంలో కెమెరాలు చోరీకి గురయ్యాయని, వాటిని తీసుకువచ్చి మీ లారీని తీసుకెళ్లండని ఈ నెల 21న మండలంలోని సంజీవరాయుడుపేట అటవీ శాఖ డిపోకు తరలించారు. దీంతో వెదురుబొంగుల కాంట్రాక్టర్లు అందరూ కలిసి అటవీ ప్రాంతంలో ఎవరో ఏదో చేస్తే తమకు సంబంధం ఏంటని అటవీశాఖ అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయమై డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావును వివరణ కోరగా..విచారణ జరుగుతుందని, పూర్తి కాగానే లారీని పంపుతామని సమాధానమిచ్చారు.

స్ఫూర్తినిచ్చిన న్యాయవాది మట్లే రాఘవరాణి

- హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు

ఒంగోలు టౌన్: ప్రజా ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన ప్రజా న్యాయవాది మట్లే రాఘవరాణి ఎంతో మందికి స్ఫూర్తినిచ్చారని హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు అన్నారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్లో శనివారం ప్రముఖ న్యాయవాది మట్లే రాఘవరాణి ప్రథమ వర్ధంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల హక్కుల కోసం చివరి శ్వాస వరకు నిజాయితీగా నిలబడిన రాఘవరాణి న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చారని కొనియాడారు. సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగిన ఆమె.. సమాజంలోని దగా పడిన జీవితాలకు బాసట నిలిచారన్నారు. మట్లే వెంకట సుబ్బయ్య, మట్లే రాఘవరాణి దంపతుల ప్రేరణతోనే తాను నిత్యం ప్రజలతో మమేకమై న్యాయమూర్తిగా ఎదగడమే కాకుండా తన సంతానాన్ని కూడా న్యాయవాద విద్యనభ్యసించేందుకు ప్రోత్సహించానని తెలిపారు. జిల్లాలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న రాఘవరాణి మహిళా న్యాయవాదులకు ఆదర్శంగా నిలిచారని చెప్పారు. మట్లే దంపతుల స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజల కోసం అహర్నిశలు పాటుపడిన రాఘవరాణి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల కోసం వారు చేసిన త్యాగాలను ఆయన గుర్తుచేశారు. జిల్లాలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమాల్లో మట్లే దంపతుల ప్రమేయం ఉందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి తెలిపారు. ఆ దంపతులను చూస్తుంటే మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి దంపతులు గుర్తుకు వస్తారన్నారు. రాష్ట్రంలో క్రైస్తవ ఆస్తుల కబ్జా కాకుండా కాపాడడానికి వెంకట సుబ్బయ్య ఎంతో కృషి చేశారని, ఆయన నివాసం ప్రజా ఉద్యమాలకు, ఉద్యమకారులకు నెలవుగా ఉండేదని గుర్తు చేశారు. ప్రరసం అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ సారా వ్యతిరేక ఉద్యమంతో పాటుగా అనేక మహిళా ఉద్యమాలలో ఆమె కీలక పాత్ర పోషించారని చెప్పారు. ప్రజా సంఘాల నాయకుడు పి.గోవిందయ్య మాట్లాడుతూ ఎన్ని బెదిరింపులు వచ్చినా, అరెస్టులు చేసినా బెదరని ప్రజా న్యాయవాదులు మట్లే దంపతులు లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత మట్లే దంపతుల చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. సభకు ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అధ్యక్షత వహించారు. మిరియం అంజిబాబు, కేశవరావు, వైవీ సుబ్బారావు, కాటం అరుణమ్మ, కె.అరుణ, కుటుంబసభ్యులు న్యాయమూర్తి మట్లే కృష్ణ, విప్లవజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు మొత్తం 6694 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ పరీక్షలకు 4927 మంది, పదో తరగతి పరీక్షలకు 1767 మంది హాజరుకానున్నారు. పరీక్ష ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. ఇంటర్ పరీక్షల నిర్వహణకు 22 కేంద్రాలు, పదో తరగతి పరీక్షలకు 9 కేంద్రాలు ఎంపిక చేశారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, అదనపు చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్ల నియామకం పూర్తిచేశారు.

చీటీల పేరుతో రూ.73 లక్షల మోసం

ఒంగోలు టౌన్: చీటీ పాటల పేరుతో లక్షలాది రుపాయలు వసూలు చేసి రాత్రికి రాత్రి ఉడాయించిన దంపతులను పట్టుకొని తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని పలువురు బాధితుల తరుపున మరాఠిపాలేనికి చెందిన ఎం అంజనీకుమారీ వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని గద్దలగుంటకు చెందిన తోటపల్లి లక్ష్మీ రాజ్యం ఆమె భర్త వెంకటేశ్వరరావు చీటీపాటలు వేసేవారు. కొంతకాలం నమ్మకంగా డబ్బులను తిరిగి ఇస్తుండడంతో వారి వద్ద పలువురు చీటీపాటలను వేశారు. పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన ఆ దంపతులు గత ఏడాది ఆగస్టులో గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. లక్ష్మీ రాజ్యం వద్ద మాకు దాదాపుగా రూ.73 లక్షల వరకు డబ్బులు రావాల్సి ఉందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వన్‌టౌన్ ఎస్సై వై.శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వంపై ప్రజల్లో విశేష స్పందన

- సంక్షేమ పథకాల అమల్లో అగ్రస్థానం
- గడప గడపలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో విశేష స్పందన ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని బక్కిరెడ్డిపాలెంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేయడంలో గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయనన్నీ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నాలుగేళ్లుగా అమలు చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ ఇంటికెళ్లినా ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనే అందుకు నిదర్శనమని ఈ సందర్భంగా తెలిపారు. తొలుత బక్కిరెడ్డిపాలెం గ్రామంలోకి ప్రవేశించినప్పుడు స్థానిక గ్రామస్థులు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పులి వెంకటరెడ్డి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో భారీగా స్వాగతం పలికారు. గ్రామంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందించి పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూబజార్‌లోని ఒక వైద్యశాలలో చికిత్స పొందుతున్న తల్లికి సాయంగా వెళ్లిన బాలిక పట్ల ఆ హాస్పిటల్‌లో పని చేసే కాంపౌండర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. కంభం రోడ్డులో నివాసం ఉండే మహిళకు అనారోగ్యానికి గురి కావడంతో నెహ్రూ బజార్‌లోని స్టూడియోల వీధులో ఉండే ఒక ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లింది. తల్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమయంలో కాంపౌండర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

వర్షంతో రైతులకు అవస్థలు



పట్టణంలో కురుస్తున్న వర్షం



నడింపల్లిలో తడిసిన ఎండుమిర్చి



వర్షం నీరు తొలగిస్తున్న రైతు

మార్కాపురం: పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో శనివారం సాయంత్రం గం.3.30 నుంచి గం.4.30 వరకు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయం అయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో, కళ్లాల్లో ఆరబోసుకున్న మిర్చి రైతులు ఇబ్బందులు పడ్డారు. అప్పటి వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురిసింది. మిర్చి తడిసిపోవడంతో రంగు మారి, కాయ నాణ్యత, దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కంభం: మండల కేంద్రం కంభంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ అధికంగా ఉండగా మధ్యాహ్నం 2.30 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి సుమారు గంటన్నర సేపు భారీ వర్షం కురిసింది. మండలంలోని నడింపల్లి గ్రామంలో రైతు కైరంకొండ రంగసాయి కళ్లంలో 20 క్వింటాళ్ల ఎండు మిర్చి ఆరబెట్టి ఉండగా వర్షానికి తడిసిపోయిందని, కొంతభాగం వర్షానికి కొట్టుకుపోయిందని రైతు వాపోయాడు. వర్షానికి వీధులు, పంటపొలాలు జలమయమయ్యాయి.

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రైతులు ఎండు మిరపకాయలు కోత కోసి పొలాల్లో ఆరబెట్టుకున్నారు. అకాల వర్షానికి కొందరి రైతుల మిరపకాయలు తడిసిపోయాయి. మార్కెట్‌కు తరలించే సమయంలో వచ్చిన అకాల వర్షాలకు రైతులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో వర్షాలకు తడిసిన మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంతంలో శనివారం సాయంత్రం జోరుగా వాన కురిసింది. సుమారు అర గంటకు పైగా జోరుగా గాలితో వర్షం కురవడంతో చెట్ల కొమ్మలన్నీ తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంగా మారింది. దీంతో దాదాపు గంటకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శివారు ప్రాంతాల్లోని మట్టిరోడ్లు చిత్తడిమయంగా మారాయి. రెండ్రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ప్రధానంగా కాపు మీద ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లనుంది.

సేవా గుణంతో వైద్య సేవలందించాలి

- మానవ సేవే మాధవ సేవగా భావించాలి
- వైద్య విద్యార్థుల స్నాతకోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్



వైద్య విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్య విద్యార్థులు ఇక నుంచి వైద్యులుగా సేవా గుణంతో వైద్య సేవలందించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, హౌస్ సర్జన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు పంపిణీ చేసే కాన్విగేషన్ (స్నాతకోత్సవం) కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కోర్సు పూర్తి చేసిన 100 మంది వైద్య విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి వైద్యులుగా మారిన వైద్య విద్యార్థులు పేదలకు సేవలందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వైద్యం రంగంలో వస్తున్న వినూత్న, ఆధునిక మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశిస్తున్నానన్నారు. వైద్య విద్యను ఇంతటితో ఆపకుండా ప్రత్యేకత ఉండే వైద్య విద్యలను అభ్యసించి ప్రత్యేక వైద్యులు గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. భారత వైద్యరంగం శక్తియుక్తులు కరోనా విపత్కర పరిస్థితిల్లో యావత్‌ప్రపంచం గుర్తించిందన్నారు. వ్యక్తిగత ఉద్యోగ జీవితాన్ని సమతుల్యం చేసుకుంటూ నైతిక విలువలతో ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమానికి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాల్మన్‌రాజు అధ్యక్షత వహించారు. దీనిలో అనాటమీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, అనాటమీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ కేశ్, జీవన్‌లు పాల్గొని వైద్య రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు

వరికూటికి మాతృ వియోగం



కోటమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు మాతృ వియోగం కలిగింది. అశోక్‌బాబు తల్లి కోటమ్మ కాకినాడలోని తన మనమరాలు వద్ద ఉంటుంది. కొన్ని రోజులుగా అనారోగ్యంగా బాధపడుతున్న ఆమె..శనివారం తెల్లవారుజామున గుండెనొప్పి రావటంతో మృతి చెందింది. కోటమ్మకు ముగ్గురు కుమారులు. ఒకరు వరికూటి కాగా, మరొకరు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కంటి వైద్య నిపుణులు వరికూటి అమృతపాణి, ఒంగోలులో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ వరికూటి వెంకట రమణారావు. తల్లి కోటమ్మ పార్థివదేహాన్ని కాకినాడ నుంచి సాయంత్రం ఒంగోలుకు తీసుకుని శ్రీనగర్ కాలనీలో రమణారావు నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. సోమవారం ఉదయం 10 గంటల తరువాత సంతనూతలపాడులోని తన నివాసం నుంచి అంత్యక్రియలు ప్రారంభమవుతాయని వరికూటి వివరించారు. కోటమ్మ పార్థివదేహానికి పలువురు రాజకీయ నాయకులు, అధికారులు నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, రాష్ట్ర సభ్యులు గుళ్లాపల్లి వీరభద్రాచారి, రాష్ట్ర కార్యదర్శి పేరం సత్యం, జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి, బాపట్ల జిల్లా అద్యక్షుడు భగత్‌సింగ్‌లు నివాళులర్పించారు. వీరితో పాటు మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సూదనగుంట హరిబాబు, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఆనం సత్యన్నారాయణరెడ్డి, తహశీల్దార్ సీహెచ్ ఉష, కొండపి సీఐ మాతంగి శ్రీనివాసరావు, పొన్నలూరు, మద్దిపూడి ఎస్సైలు రాజారావు, అంకమ్మరావులు నివాళులర్పించారు.